పునర్వివాహం

వెంకటశివుడూ భార్యా కలిసి వితంతుశరణాలయం స్థాపించారంటే, వాళ్ళిద్దరూ అంత మంచి వాళ్ళయినా, లాభంమీద వాళ్ళకి దృష్టి లేకపోలేదు. బాలవితంతువులపైన అతనికి కాంక్షలేదు. వాళ్ళ నగలమీద ఆమెకే కాంక్షలేదు. అంతవరకే వాళ్ళమంచి. శరణాలయాన్ని వృత్తికింద వాళ్ళు అభిప్రాయ పడలేదంటే అది సరికాదు. శరణాలయాలు నిలబెట్టి కొన్ని పెళ్ళిళ్ళు చేయించినవాళ్ళకి పంజాబులో ఎవరో ధనసావత్సరీకాలు ఇస్తారని కూడా తెలుసు వాళ్ళకి.

కాని ఆర్నెల్లయినా ఒక్క వితంతువూ చేరలేదు. ఆరేళ్ళకిందట పోరుపడలేక తాను తరిమేసిన నాయనమ్మని, ఏదో ఒక వితంతువు వుందని చూపించుకోడానికి తీసుకొద్దామని కోటిపల్లివెళ్ళి, ఆమెలేక తానెంత నాశనం అయిపోయినాడో చెప్పి వొప్పించాలని చూశాడుగాని, ఆమె ఒక ఎకరం భూమి రాసిస్తేనేగాని రానంది. చచ్చిపోయిన తన పరమ మిత్రుడి యవ్వన వితంతువుని వొచ్చి, తన శరణాలయాన్ని అలంకరించి రక్షించమని ప్రార్థిస్తే, పొరుగింటి కంసాలిని, అతని కుటుంబంతో సహా తనతో తీసుకుని రానిస్తేనేగాని రానంది ఆమె. చివరికి వెంకటశివుడుతానే చచ్చిపోయి తన భార్యని వితంతువుగా నిలబెడదామనంత డెస్పరేట్ అయినాడు.

ఏమిటా ఇట్లా అయిందని ఆలోచిస్తో వుండగా వాళ్ళ అదృష్టాన ఒక దరఖాస్తు వొచ్చింది. వెంటనే రమ్మని రాశారు. మళ్ళీ తప్పిపోతుందేమోనని రాజమ్మ పొన్నూరు వెళ్ళి స్వయంగా వెంటపెట్టుకు ఆమెని తీసుకుని వొస్తానంది. కాని ఆత్రుత వల్ల కార్య చెడుతుందని, బెట్టుగా వుత్తరం రాసి వూరుకున్నారు. ఆ వితంతువు వొక్కత్తా దిగింది. వయసు ఇరవై ఏళ్ళు, చాలా నవ్వుతో కలిసికట్టుగా వుంటుంది. చిన్నప్పుడే భర్తపోయినాడు. రెండునెలల్లో తనకి పెళ్ళి చెయ్యాలని చెప్పింది. కాని వరుణ్ణి ఏరుకోడంలో తనకె కొంత స్వతంత్రం కావాలని అంది. శరణాలయంలో లేరుగాని, వరుల దగ్గిర్నించి చాలాదరఖాస్తులు వున్నాయి. ఒచ్చిన వితంతువు లక్ష్మి, వాటిని పరిశీలించి చాలావాటిని నిరాకరించింది. వాటిల్లో రెండింటిని ఏరి వాళ్ళని స్వయంగా పరిశీలిస్తానన్నది. వాళ్ళకి ఉత్తరాలు వెళ్ళాయి. వాళ్ళు వొచ్చాక ఇన్‌టర్‌వ్యూలిచ్చింది. కాని వాళ్ళు ఆమెకు నచ్చలేదు. కాని కొత్త దరఖాస్తులు వొస్తోనే వున్నాయి.

బాపట్లనించి వొచ్చిన ఓ దరఖాస్తుదారుణ్ణి ఏరుకుంది లక్ష్మి. అతను ఫోటోకూడా పంపాడు. వయసు యిరవై అయిదు ఏళ్ళు. కులంకూడా సరిపోయింది. వర్తకం డబ్బువుంది. అతనువొచ్చాడు. లక్ష్మి అతనికి పెద్ద ఇన్‌టర్‌వ్యూ ఇచ్చింది. పెళ్ళికివొప్పుకుంది. పెళ్ళికి ఎక్కువ ఖర్చు చెయ్యలేనన్నాడు. ఆ వూళ్ళో నవ్వులపాలుకాకండా ఓ వివాహంకూడా

జరిపిస్తున్నామని ఆ దంపతులకి చాలాసంతోషమైంది. మొదటి వివాహం గనక ఖర్చు కొంత చెయ్యాలనుకున్నారు. వూరివారి నందర్నీ పిలిచారు. బహిరంగసభ కూడా జరిగింది. ఉపన్యాసకులు పాత మూఢాచారాన్ని బాగా ఖండించి, వెంకటశివదంపతుల ఉదారత్వాన్ని, సాహసాన్ని చాలా శ్లాఘించారు. ఆ వూరి హెడ్మాస్టరుగారు వెండి కప్పుని, ఓ డాక్టరుగారు పట్టు బట్టల్ని పెట్టారు వధూవరులకి. వివాహమై సలక్షణంగా వెళ్ళారు వధూవరులు.

రామచంద్రయ్య లక్ష్మి వివాహం ఏ ముహూర్తాన జరిగిందోగాని తరవాత మూడు సంవత్సరాలలో ఆశరణాలయంలో ముప్పై వివాహాలు జరిగాయి. చాలా వృద్ధిలోకి వొచ్చింది శరణాలయం. ఓసారి బాపట్లలో ఒక గొప్ప ఇంటి వితంతువు ఉత్తరం రాసింది. రహస్యంగా తనని ఇంట్లోంచి తీసుకునివెళ్ళి వివాహం చెయ్యమని. బాపట్లలో రామచంద్రయ్య సహాయంతో సున్నితమైన ఆ వ్యవహారాన్ని సాధించ వొచ్చుననుకున్నాడు వెంకటశివుడు. కాని రామచంద్రయ్య ఇంటిపేరు మరిచిపోవడంవల్ల అతని కోసం వెతకడం కష్టమయింది. ఆ వూళ్ళో అతని ఇంటో బసచెయ్య వొచ్చునని అనుకోవడం వల్ల రామంచంద్రయ్య కోసం వెతకడం ప్రాముఖ్యం వహించింది. ఎవరి నడిగినా ఏ రామచంద్రయ్య అంటారు. వితంతు వివాహం చేసుకున్న రామచంద్రయ్య అసలు ఆ వూళ్ళో ఎవరూలేరు. విసికి సత్రానికి వెడుతో వుండగా బండీ అతను ఓ ఏడెనిమిదేళ్ళ కుర్రాణ్ణి చూపించి 'అతనేనండి రామచంద్రయ్యగారి అబ్బాయి' అన్నాడు. ఆ కుర్రాణ్ణి ఆపి.

"మీ నాన్నగారి పేరేమిటి?" అని అడిగారు వెంకటశివుడు.

"రామచంద్రయ్యగారు."

"మీ అమ్మ పేరు ?"

"లక్ష్మి"

"మీ ఇల్లు తాళంవేసి వుందేం ?"

"తాతయ్యగారి ఇంటో సత్యనారాయణవ్రతం. అక్కడికి వెళ్ళాం."

"తాతయ్యగారంటే ?"

"మా అమ్మ తండ్రి."

"మీ నాన్నగారు అక్కడ వున్నారా?"

"ఆ."

"రా బండీలో కూచో. నేను వస్తాను" అని బయలుదేరాడు వెంకటశివుడు.

లక్ష్మిది పొన్నూరుకాదూ ? తండ్రి ఆచారపరుడు. తనుకంట బడితే నరికేస్తాడు అని చెప్పింది. కాని మూడేళ్ళయింది మరి. తండ్రి బాపట్లకి మారాడు గావును. కాలం మారింది. తీరా పెళ్ళి అయ్యాక ఏం చేస్తాడు. కన్నకడుపు. కాని ఈ కుర్రాడికి

ఏడెనిమిదేళ్ళు వున్నాయే! పెళ్ళయి మూడేళ్ళేగా అయింది ? రామచంద్రయ్య మొదటి భార్య కొడుకేమో ! కాని తనకి పెళ్ళే కాలేదన్నాడు అతను.

ఎన్ని అబద్ధాలాడతారు యీ వితంతువివాహాల వాళ్ళు-ఏమైతేనేం దంపతులు సుఖంగా వున్నారు. ఆ మొదటిపెళ్ళి చాలా మంచి కాపరంగా సుఖపడుతున్నారు. కాని.....

నాయనా, లక్ష్మేరా మీ తల్లి?"

"ఊఁ."

"ఆమెకే పుట్టావా !"

తెల్లబోయి చూశాడు కుర్రాడు.

"అంటే, నిన్ను పెంచుకున్నారా? ఇంకో అమ్మ వుండేదా నీకు?" దానికీ జవాబు చెప్పలేకపోయినాడు అతను.

ఇంతలో బండి ఇంటికి వొచ్చి చేరింది. రామచంద్రయ్యగారి మామగారు పందిట్లో కూచున్నాడు. ఆయన రిటైరైన రిజిస్ట్రారు. వెంకటశివుణ్ణి కూచోమని కుశలప్రశ్నలు వేశాడు ఆయన. రామచంద్రయ్య ఇంట్లోలేడు. బజారు వెళ్ళాడు. లక్ష్మి వడ్డనలో వుంది. ఈ మామగారు చాలా పూర్వాచారపరుడు.

"తమరిలాటివారిని కలుసుకోవడం చాలా అదృష్టం. సుదినమిది" అన్నాడు వెంకటశివుడు.

"ఏదోలెండి. అయిపోయింది మాకాలం. వుద్యోగంఅదీ. చేసిన ఉపకారాలు చేశాను. కాని మరిచిపోయినారు అప్పుడే నన్ను."

'అది కాదండి. ఇంత పూర్వాచారపరులై వుండి కూడా-వృద్ధులూ, పెద్దలూ మీవంటివారు వితంతువుల దుస్థితిని అర్థం చేసుకుని, ఏ సంకోచం లేకండా, ఈ పాడు సంఘాన్ని లెఖ్ఖ చెయ్యటం లేదంటే చూడడం నా కెంతో ఆనందంగా వుంది"

రిజిస్ట్రారు తెల్లబోయి చూశాడు.

"వితంతువు వివాహాలా ! నా చెవుల బడనీకండి. చాలా ఘోరం. అట్లాంటివి వినడం మహాపాపం." వెంకటశివుడు తెల్లబోయాడు. తన కూతురు సంగతి దాచేస్తున్నాడు ఈయన ! తనకి ఫలహారం సంగతి అట్లావుంచి, కాఫీకూడా ఇచ్చేట్టులేదు. వెంకటశివుడికి వొళ్ళు మండింది. ఇంత దొంగలు వుంటారనుకోలేదు. అందరి ముందూ పరాభం చెయ్యాలి. ఈ ముసలాయన్ని.

"లక్ష్మి సుఖంగా వుందండీ!"

"ఊఁ, వుంది. కాని లక్ష్మినేం ఎరుగుదురు మీరు?"

"మా శరణాలయంలో వుంది కదండీ."

"శరణాలయమా? మా లక్ష్మి వుండడమేమటి? ఎందుకు వుంటుంది శరణాలయంలో?"

"మేమేగా ఆమెని రామచంద్రయ్యగారికి ఇచ్చి పెళ్ళిచేసింది?"

"మీరా?"

చుట్టూ చూశాడు ఆయన.

"మూడువేలు ఖర్చుపెట్టి నేను ఈ వూళ్ళో మా లక్ష్మికి పెళ్ళిచేస్తే, మీరా పెళ్ళిచేసింది? ఏ లక్ష్మి సంగతి మాట్లాడుతున్నారు?"

అందరూ ఆశ్చర్యంగా చూస్తున్నారు అతని వంక, పిచ్చివాడేమో నన్నట్టు.

"ఎప్పుడు పెళ్ళిచేశారు?" అన్నాడు మళ్ళీ.

"మూడేళ్ళ క్రిందట."

అందరూ పకపక నవ్వారు.

"దాని కొడుక్కి ఏడేళ్ళున్నాయి. పెళ్ళయి ఎనిమిదేళ్ళయింది." వెంకటశివుడు లేవబోతున్నాడు. వీళ్ళుకాదు వాళ్ళు. రామచంద్రయ్య వొచ్చాడు. వెంకటశివుణ్ణి చూసి "ఎప్పుడు రావడం," అంటున్నాడు. ఇంతలో మామగారు, "ఈయన్ని ఎరుగుదువా? అదేమిటి, ఆయననీకేదో వితంతు వివాహం చేశాట్ట" అన్నాడు.

రామచంద్రయ్య మొహం తెల్లగా అయింది. అందరూ ఆగివింటున్నారు.

"నా కూతురు లక్ష్మి వితంతువా ?"

రామచంద్రయ్య ఏం మాట్టాడలేదు. ఇబ్బందిపడుతో చూస్తున్నాడు వెంకటశివుడు. అన్యాయంగా రామచంద్రయ్య రహస్యాన్ని దేన్నో బైటపెట్టాను గావునని. మెల్లిగా రామచంద్రయ్య మొహంలోకి అణగకండా నవ్వు వొస్తోంది.

"బైటపడ్డదా ? అవును నిజమే, లక్ష్మికి నాకూ ఈయనేగా పెళ్ళిచేసింది?"

రిజిస్ట్రారు తనని అల్లుడు ఎగతాళి చేస్తున్నాడని గ్రహించాడు.

"వేళాకోళమా ఏమిటి నాతో!"

"కాదు నిజమే; మూడేళ్ళనాడు జ్ఞాపకంలేదూ వితంతు వివాహాల విషమయై పెద్దతగాదాపడ్డాం?" అని వెంకటశివుడి వేపుతిరిగి,

"క్షమించాలి మీరు, కొంచెం మోసంజరిగింది. మా వదినగారికి వితంతువివాహం చెయ్యమని మామగారితో పెద్ద రగడ పెట్టుకున్నాను. అది అందరికీ తెలుసు. లక్ష్మి కూడా నా పక్షమే. మా వదినగారికి మతి చెరిచి మేము ఆమెని తీసికెడతామన్నంత భయం

పట్టుకుంది మామగారికి. నిజంగా అంతపని చెయ్యాలనే అనుకున్నాం. చిన్నతనం. ఓ రాత్రి మాటలు పెరిగాయి మామధ్య.."

అని రామచంద్రయ్య చెపుతోవుంటే, రిజిస్ట్రారు మొహంలో భయం చూస్తే, ఆ వొదినగారికి విధవావివాహం చెయ్యాలన్న విషయంవెనక ఇంకా అవమానపుగాధ వుందనిపించింది వెంకట శివుడికి.

"నన్నూ లక్ష్మినీ ఇంట్లోంచి పొమ్మన్నారు ఈయన. నేను లేనివాణ్ణి. వీరిమీదనే ఆధారపడ్డాను. ఆనాడు తిండికి నిరాధారులం ఏం చేస్తాం ? మా అబ్బాయిని ఈ ఇంట్లో వొదిలేసి బైటపడ్డాం. నాకు త్వరలో ఉద్యోగ మౌతుందని ఆశ. ఆయన కోపమూ అట్టే రోజులు వుండదని తెలుసు. అందుకని లక్ష్మి ఆశ్రయంకోసం మీకు దరఖాస్తు పెట్టాము లక్ష్మి వితంతువు అని. అనుగ్రహించి లక్ష్మికి మీరు ఆశ్రయమిచ్చారు. తరవాత నాకు ఉద్యోగమూ అయింది.

మా వదినగారు ఇంక ఈ ఇంట్లో వుండడానికి వీలులేని పరిస్థితి వొచ్చి, పండరిపురం వెళ్ళిపోయింది. అందువల్ల మా మామగారు మమ్మల్ని క్షమించారు.

మరి మీ ఆశ్రయంనించి లక్ష్మిని తీసుకురావడం ఎట్లా? మీరు తనని చాలా దయగా చూస్తున్నారనీ, మీకు లేక లేక కలిగిన వితంతువును తాను వొక్కత్తేననీ, తనకి మీ శరణాలయంలో వివాహం జరగకపోతే మీ హృదయం భగ్నమైపోతుందనీ లక్ష్మి నాకు రాయడంవల్ల, వరుడికింద నేనే దరఖాస్తుపెట్టి మిమ్మల్ని మోసగించాల్సి వొచ్చింది" అన్నాడు.

◆ ◆ ◆

*రచనాకాలం : **1947**, ఆగస్టు ,*

ప్రచురణ : స్వతంత్రవారపత్రికలో